అమ్మల ఆశలపై నీళ్లు

- 'తల్లికి వందనం'పేరుతో చంద్రబాబు మార్కు మోసం
- ఇంటిలో చదువుకునే పిల్లలందరికీ రూ.15వేలు చొప్పున చెల్లిస్తామని ఎన్నికల్లో హామీ
- ప్రస్తుతం ఒక్కో తల్లికి రూ.15 వేలు మాత్రమే అందిస్తామని జీవో
- నమ్మి మోసపోయామని విద్యార్థుల తల్లుల ఆవేదన



స్కూల్‌కు వెళ్లే ప్రతీ విద్యార్థికి రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని టీడీపీ ఇచ్చిన ప్రకటన

గాజువాక: మరోసారి తనదైన శైలిలో మాతృమూర్తులను మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడు. ప్రతీ విద్యార్థి చదువుకోవాలని, అందుకు తల్లిదండ్రులూ సహకరించాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'అమ్మ ఒడి'పేరుతో అండగా నిలిచారు. ఇంటిలో ఒక విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసి పేదల విద్యకు భరోసా కల్పించారు. అయితే అధికారమే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎంత మంది పిల్లలు స్కూల్, కళాశాలలో చదివితే అందరికీ 'తల్లికి వందనం'పేరుతో రూ.15 వేలు వంతున ఇస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి'పేరుతో ఒక్కరికే ఏడాదికి రూ.15 వేలు ఇచ్చిందని... ఎందరు చదివితే అందరికీ రూ.15 వేలు చొప్పున తాము అధికారంలోకి వచ్చాక చెల్లిస్తామని ప్రచార సభల్లో ఊదరగొట్టారు. దీంతో కూటమి నాయకుల మాయమాటలు నమ్మిన ప్రజలలో చాలా మంది ఈ విద్యా సంవత్సరం నుంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు మార్చారు.

ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల తర్వాత 'తల్లికి వందనం'ఇంటిలో ఒక్కరికే ఇస్తామని అనడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు ఇస్తామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు మాట తప్పుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి తల్లి తన ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొనడంతో ఒక తల్లి బిడ్డల్లో ఎంత మందికి ఈ పథకం ఇస్తారో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో గాజువాక నియోజకవర్గంలోని 87 ప్రాథమిక పాఠశాలలు, 9 హైస్కూళ్లతో పాటు ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 37,771 మంది విద్యార్థులు అమ్మఒడి పథకం కింద లబ్ధి పొందేవారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఈ సంఖ్య బాగా పెరగాల్సి ఉంది. అయితే, ప్రభుత్వం తాజాగా జారీ చేసిన జీవో మాత్రం దానికి భిన్నంగా ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

అప్పులు చేయాల్సి వస్తోంది



ఓ ప్రైవేటు పాఠశాలలో మా పాప 4వ తరగతి, బాబు 2వ తరగతి చదువుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా 'తల్లికి వందనం' పేరుతో డబ్బులు జమ చేయలేదు. ఫీజులు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి తెస్తోంది. పుస్తకాలు కొనమంటూ పిల్లలు రోజూ అడుగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభించే నాటికి ఠంచనుగా 'అమ్మ ఒడి' డబ్బులు నా ఖాతాలో జమ చేసేవారు. ఆ డబ్బులతోనే పిల్లల ఫీజు కట్టేదాన్ని. పుస్తకాలు కొనేదాన్ని. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ప్రకటించారు. నా ఇద్దరు పిల్లలకూ రూ.30వేలు ఇస్తారని ఆశగా ఎదురు చూస్తున్నా. ఆ డబ్బులు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. అప్పటి వరకూ అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– బి.భాను కల్యాణి, పెదగంట్యాడ

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారు..



మాకు ఇద్దరు పిల్లలు. గాజువాకలోని ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. మాకు పెద్దగా ఆదాయం లేకపోయినా అమ్మఒడి వల్ల ఫీజులు చెల్లించడానికి ఇబ్బంది ఉండేది కాదు. గతంలో పాఠశాలల ప్రారంభం సమయంలోనే అమ్మఒడి డబ్బులు వేసేవారు. ఇప్పుడు స్కూళ్లు తెరిచి నెల రోజులు అయిపోతోంది. ఇంకా డబ్బులు పడలేదు. ఫీజులు చెల్లించమని స్కూల్ మేనేజ్‌మెంట్ ఒత్తిడి తెస్తున్నారు. ఇంట్లో ఎంత మంది చదివితే అందరికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు చొప్పున అందిస్తామని సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇప్పుడు తాజాగా విడుదల చేసిన జీవో గందరగోళానికి గురిచేస్తోంది. జీవో సవరించి మా పిల్లలు ఇద్దరికీ తల్లికి వందనం డబ్బులు వెంటనే వేయాలని కోరుకుంటున్నాను.

– ఎస్.కె.నూరి జహాన్, గాజువాక

'తల్లికి వందనం'హామీ నిలబెట్టుకోవాలి



నాకు ఇద్దరు ఆడ పిల్లలు. హైస్కూల్‌లో చదువుతున్నారు. స్కూల్ ప్రారంభమై నెల కావస్తుంది. ఇంత వరకు తల్లికి వందనం డబ్బులు పడలేదు. ఈ పథకం కింద వచ్చే డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాను. ఎంత మంది పిల్లల్ని చదివించుకుంటే అంతమంది పిల్లలకు రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పథకం కింద డబ్బులు వేస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు ఆధార్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అంటున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా ఈ పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. – కందిపూడి లావణ్య, గాజువాక

తల్లులను మోసం చేయడం న్యాయం కాదు



మా బాబు ప్రైవేట్ స్కూల్‌లో 7వ తరగతి, పాప ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. మాది పేద కుటుంబం. గత ప్రభుత్వంలో జూన్‌లో 'అమ్మ ఒడి' డబ్బులు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఫీజులు సకాలంలో చెల్లించే వాళ్లం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికీ 'తల్లికి వందనం' నగదు చెల్లించడం లేదు. ఎన్నికల సమయంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే వారందరికీ రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని చంద్రబాబు ప్రచారం చేయడంతో ఓట్లు వేసి గెలిపించాం. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికే డబ్బులు చెల్లిస్తామనడం మోసం చేయడమే అవుతుంది. – ఆర్.రేవతి, అక్కిరెడ్డిపాలెం

క్లుప్తంగా

వైభవంగా తిరుప్పావడ సేవ


తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో గల శ్రీ తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలో తిరుప్పావడ సేవ భక్తిశ్రద్ధలతో గురువారం వైభవంగా నిర్వహించారు. పులిహోరను రాశిగా పోసి స్వామికి ఇష్టమైన రకరకాల వంటకాలు నివేదించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నరసింహస్వామి, రామావతారాల్లో జగన్నాథుడు


నరసింహస్వామి, రామావతారాల్లో దర్శనమిస్తున్న జగన్నాథుడు

అక్కిరెడ్డిపాలెం: అగనంపూడిలో జగన్నాథ స్వామి రథోత్సవంలో భాగంగా స్వామి వారు నరసింహస్వామి, రామావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆలయంలో శ్రీలక్ష్మీ దేవి అమ్మవారికి పల్ల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. శ్రీసత్యసాయి భజన మండలి భజన కార్యక్రమం అలరించింది. ఆలయ ప్రధానార్చకుడు గురు సంతోష్ స్వామి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కరణం పైడిరాజు, మామిడి నాగేశ్వరరావు, గల్లా సాయికుమార్, నారాపిన్ని నాగమణి, కునుమంచి కుమారి, వరదరాణి రాధిక, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ నుంచి గంభీరం వరకు సిటీ బస్సు సౌకర్యం

డాబాగార్డెన్స్: భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ గంభీరంకు రూట్ నంబరు 25–ఐఐఎమ్ సిటీ బస్సు సౌకర్యం కల్పించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు తెలిపారు. ఈ బస్సు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం, హనుమంతువాక, మధురవాడ, మారికవలస మీదుగా ఐఐఎంకి చేరునని తెలిపారు.

రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరు సమయం
ఉదయం 07:30, 10:20 మధ్యాహ్నం ఒంటి గంటకు..

ఐఐఎం నుంచి బయలుదేరు సమయం:
ఉదయం 08:55, 11:35, మధ్యాహ్నం 14.30, 18:15

ట్రిపుల్ ఐటీకి నడుపూరు విద్యార్థిని ఎంపిక

పెదగంట్యాడ: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అలమండ గాయత్రి రమ్య ఎంపికైంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆమె 574 మార్కులు సాధించింది. మండలంలోని వెంపళ్లనగర్‌కు చెందిన గాయత్రి రమ్య తండ్రి చిన్నారావు కార్పెంటర్ వర్క్స్ చేస్తుంటారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన గాయత్రి రమ్యను నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

కేంద్ర మంత్రికి వినతులు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కుమంత్రి హెచ్‌డీ కుమారస్వామికి వివిధ సంఘాల నాయకులు తమ సమస్యలను వినతిపత్రాల ద్వారా అందజేశారు. ప్రైవేటీకరణ జరిగితే నిర్వాసితులు నష్టపోతారని, వారికి ఉపాధి కల్పించాలని, వయసు పైబడిన వారికి శాశ్వత ఉపాధి కల్పించాలని స్టీల్ డీవీఆర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణారెడ్డి వినతిపత్రం అందజేశారు. ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన 8500 మందికి ఉపాధి కల్పించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు.

బేటీ పడావో.. బేటీ బచావోపై కళాజాత


అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో కళాజాతలో అంగన్వాడీ కార్యకలాపాలను వివరిస్తున్న దృశ్యం


బాల్య వివాహాలు వద్దంటూ కళాజాతలో వివరిస్తున్న కళాకారులు

అక్కిరెడ్డిపాలెం: బేటీ పడావో, బేటీ బచావోపై అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం కళాజాత నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహిస్తున్న కార్యకలాపాలను కళాకారులు గానం రూపంలో వివరించారు. అక్కిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్–1, 2లలో నిర్వహించిన కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు చిన్నారులకు అందిస్తున్న డైట్, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను చులకనగా చూడవద్దని, వారికి మంచి విద్యను అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అక్కిరెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు, సచివాలయం, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: బాల్య వివాహాలు వద్దని, బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దామంటూ కళాజాత కళాకారులు వివరించిన తీరు పలువురిని ఆలోచింపజేసింది. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని జీవీఎంసీ 64వ వార్డు వెంకన్నపాలెం, యాతపాలెం, అంగన్‌వాడీ కేంద్రం వద్ద కార్యకర్తలు పి.భవాని, సీహెచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరీ బాలికలు, బాలింతలు, గర్భిణులు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. బాలల హక్కుల చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పౌష్టికాహారంపై వివరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు జయలక్ష్మి, రమావతి,ః సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కంది పప్పు, బియ్యం కౌంటర్ ప్రారంభం


కంది పప్పు విక్రయాలు ప్రారంభిస్తున్న 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి

పెదగంట్యాడ: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పెదగంట్యాడ రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన కంది పప్పు, బియ్యం విక్రయాల కౌంటర్‌ను 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్సిడీపై సరఫరా చేస్తున్న సరకులను కొనుగోలు చేయాలని వినియోగదారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాష్, ఏఎస్‌వో తవ్వా కృష్ణ, స్థానిక నాయకులు పులి వెంకట రమణారెడ్డి, నమ్మి అప్పారావు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ సమష్టి బాధ్యత


వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ జరిగింది. రేసవానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు జరిగింది. ఈ సందర్భంగా జగదీశ్వర రావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను నియంత్రించవలసిన అవసరం ఉందన్నారు.

జనాభా పెరుగుదల వలన అభివృద్ధి తగ్గుతుందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ఇతర సమస్యలను పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీష్ ప్రసాద్, ధర్మేంద్ర, విష్ణు, ఎస్.బేగం, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు శశి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


స్వర్ణపుష్పాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం ఏడుగంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించాయ. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న నెల్లిముక్కు పీహెచ్‌సీ సిబ్బంది

పెదగంట్యాడ: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు పీహెచ్‌సీ వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. నానాటికీ పెరిగిపోతున్న జనాభా వల్ల తలెత్తే దుష్పరిణామాలు, జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది తనకాల సత్యనారాయణ, సౌజన్య, రాజ్యలక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రెండో శనివారం స్కూళ్లకు సెలవు ఇవ్వాలి

విశాఖ విద్య: రెండో శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు తప్పనిసరిగా సెలవు ప్రకటించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి. సీతారాం ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతీ నెలా రెండో శనివారం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించాలన్నారు. విద్యా క్యాలెండర్ పనిదినాలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్స్ చేస్తామన్నారు. జిల్లాలో రెండో శనివారం, లేదా ఆదివారం రోజుల్లో ఎక్కడైనా స్కూళ్లు తెరిచి, తరగతులు నిర్వహించినట్లైతే తల్లిదండ్రులు కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

లలితా పీఠంలో వారాహి హోమం


వారాహి హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో ఈ నెల 6 నుంచి జరుగుతున్న వారాహి దేవి నవరాత్రుల్లో భాగంగా గురువారం సాయంత్రం వారాహి హోమం నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో పండితుల వేద మంత్రాల మధ్యం శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముందుగా వారాహి దేవికి సహస్ర నామార్చన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 15వ తేదీతో నవరాత్రులు ముగుస్తాయని ఆయన తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 32 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ–శీలానగర్ 11 కేవీ, కేవీ వెంకటేశ్వర కాలనీ 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్– 2 ఈఈ బి.కె.నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కిరెడ్డిపాలెం పార్క్, వివేకానంద కాలనీ, వికాశ్ కాలేజ్, ఏషియన్ పెయింట్స్, డెయిరీ క్వార్టర్స్, వెంకటేశ్వర కాలనీ, కిమ్స్ ఐకాన్ హాస్పటల్, శీలానగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పెదగంట్యాడ: 11 కేవీ నొవాస్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని వుడా కాలనీ ఫేజ్–2, అమరావతి పార్కు, రామచంద్రనగర్, గాంధీనగర్, గోపాలరెడ్డినగర్, పోర్టు రోడ్డు ఏరియా, జీవీఎంసీ డంపింగ్ యార్డ్, భరత్ నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకూ విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

గాజువాక: జగ్గు జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్‌డీఆర్ ఫీడర్‌కు శుక్రవారం నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా గొంతినవానిపాలెం ఏరియా, మెహర్‌నగర్, నాయుడోరు వీధి, ప్రశాంతినగర్, కణితి మెయిన్ రోడ్, మోర్ సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినులకు స్కాలర్‌షిప్స్


అంధ విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రోటరీక్లబ్ విశాఖ శాఖ గురువారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఐదుగురు అంధ విద్యార్థినులకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున స్కాలర్‌షిప్స్‌లను అందజేసింది. కళాశాలకు చెందిన ఐక్యూఏసీ ఆధ్వర్యంలో కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజులా మాట్లాడుతూ రోటరీక్లబ్ వాల్తేర్ తమ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన ఐదుగురు అంధ విద్యార్థినులకు ఈ స్కాలర్‌షిప్స్ అందజేయడం, అలాగే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో పనిచేసే కళ్లద్దాలను అందివ్వడం అభినందనీయమన్నారు. రోటరీక్లబ్ వాల్తేర్ ప్రెసిడెంట్ ఎస్ దేవానంద్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేయాలన్నారు. రోటరీక్లబ్ మాజీ ప్రెసిడెంట్ ఎంవీ నారాయణరావు , విజన్ ఎయిడ్ సంస్థ వైస్‌చైర్మన్ అవసరాల శ్రీనివాస్ , రోటరీక్లబ్ వాల్తేర్ సెక్రటరీ కె. ప్రసన్నకుమార్, ప్రోగ్రామ్ కన్వీనర్ బి రాధమ్మ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సంతోషి అనూష, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఆంగ్ల అధ్యాపకురాలు సునీత పాల్గొన్నారు.

ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా వాహనాలను అనుమతించాలి


మల్కాపురం బస్టాప్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ప్రత్యామ్నాయం చూపకుండా ఎస్‌బీసీ వద్ద గల డాక్‌యార్డ్ బ్రిడ్జిని మూసివేస్తామనడం సరికాదని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. నేవల్ డాక్‌యార్డ్ పక్కన గల షిప్ బిల్డింగ్ సెంటర్(ఎస్‌బీసీ)కు అతి సమీపాన గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను మూసివేయాలని అధికారులు చూస్తున్నారు. దీనిలో భాగంగా బ్రిడ్జికి మరమ్మతుల చేసేందుకు దానిపై నుంచి ఎటువంటి వాహనాలను అనుమతించమంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై సీపీఎం నాయకులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మల్కాపురం బస్‌స్టాప్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ డాక్‌యార్డ్ వద్ద గల వంతెనకు మరమ్మతులు చేయడం మంచిదే కానీ.. ఇటుగా వచ్చే వాహనాలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఆకస్మాతుగా ఇలాంటి నిర్ణయం తీసుకుంటే వాహనదారుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాలవాసులు, ఉద్యోగులు, విద్యార్థులు అటు నగరంలోకి.. ఇటు డాక్‌యార్డ్, ఎస్‌బీసీ, ఎస్‌ఆర్ వంటి పరిశ్రమలకు నిత్యం ఈ వంతెన మీదగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడు ఈ బ్రిడ్జిని మూసివేస్తే సమయం వృథా కావడంతోపాటు వారికి ఇబ్బందులు తప్పవని చెప్పారు. అధికారులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని వాహన చోదకులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.